క్లుప్తంగా

శేరిలింగంపల్లిలో 6,98,079 ఓటర్లు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తుది జాబితా ప్రకారం 6,98,079 మంది ఓటర్లు ఉన్నారు. బుధవారం వెల్లడించిన తుది జాబితా ప్రకారం పురుష ఓటర్లు 3,70,301 కాగా, మహిళా ఓటర్లు 3,27,636, ఇతరులు 142 ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత జాబితాలో కొత్తగా నమోదు కావడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లతో 41,981 జాబితాలో నమోదు అయినట్లు తెలిపారు.

33మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 33 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 33 మంది పట్టుబడగా బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 31 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలో యాభై లక్షల నిధులతో రాజీవ్‌గాంధీ నగర్‌లో నిర్మాణ దశలోని, మొగులమ్మ కాలనీలో పూర్తయిన సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించడంతో బాటు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షపు నీరు నిలవకుండా నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, గుడ్ల శ్రీనివాస్ యాదగిరి, ఇంతియాస్, శశి, వెంకటేష్, మహేష్, రమేష్, శేఖర్, కృష్ణ, బాలరాజు, పద్మయ్య, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రిసోర్స్‌పర్సన్లకు వేతనాలు పెంచిన సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సమక్షంలో డివిజన్ ఆర్పీలందరు కలిసి ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన గచ్చిబౌలి క్రీడాకారులు

గచ్చిబౌలి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం క్రీడాకారులు ప్రతిభ చాటారు. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి తెలంగాణ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ అండర్-14,16,18,20 బాల బాలికల, మహిళ, పురుషుల పోటీల్లో గచ్చిబౌలి క్రీడాకారులు మెడల్స్ సాధించారు. అందులో ఎం దినేష్ 100 మీటర్ల మెన్ పోటీలో బంగారు పతకం, పీఎస్ అభిలాష్ 200 మీటర్ల పోటీలో వెండి పతకం, యుగంధర్ 800 మీటర్లలో బంగారు, మెర్దిని రెండు కిలోమీటర్ల బాలికల విభాగంలో బంగారు పతకం, ప్రీతిక 800 మీటర్లలో వెండి పతకం, సంజన 300 మీటర్లలో వెండి పతకం, పార్థు రిలేలో బంగారు పతకం, శివాని రిలేలో కాంస్య పతకం, ఆయేషా లాంగ్ జంప్, 60 మీటర్ల రన్‌లో కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించిన వీరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని గచ్చిబౌలి స్టేడియం కోచ్ ఎం శ్రీనివాస్ వివరించారు.

ఓటర్ల తుది జాబితా ప్రదర్శన

- చందానగర్ సర్కిల్- 21 పరిధిలో 2,68,746 ఓటర్లు



హఫీజ్‌పేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఓటర్ల తుది జాబితాను డీసీ వంశీకృష్ణ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ 21 పరిధిలో మొత్తం 2,68,746 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,43,461, మహిళలు 1,25,236, ట్రాన్స్‌జెండర్లు 49, పోలింగ్ స్టేషన్లు 241 ఉన్నాయన్నారు.

డేటా ఇంజనీరింగ్‌పై అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు సమాయత్తమవుతోంది. 'డేటా ఇంజనీరింగ్ అండ్ మెషిన్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై నవంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.డేటా సైన్స్,డేటా ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా ,క్లౌడ్ కంప్యూటింగ్, సుస్థిరత విజ్ఞాన ఆధారిత నిపుణుల వ్యవస్థలపై ఆలోచనలు, కొత్త పరిశోధనల్లోని అంతర్గత అంశాలను పంచుకోవడానికి విశ్వవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు,విద్యావేత్తలకు ఒక అంతర్జాతీయ వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యంగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 15వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని స్పష్టీకరించారు. పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం 9620160306ని సంప్రదించవచ్చు.

రహదారుల విస్తరణతో.. అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- బతుకమ్మ చీరలు పంపిణీ



పాశమైలారంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు విస్తరిస్తున్నామని, దీని మూలంగా అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ, పాశమైలారం, బచ్చుగూడెం, పెద్దకంజర్ల గ్రామాలలో పర్యటించి 28 కోట్ల రూపాయల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రధానంగా నందిగామలో మూడు కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించారు.అనంతరం ఓఆర్ఆర్ జంక్షన్ నుండి పెద్ద కంజర్ల మీదుగా శివానగర్ వరకు 22 కోట్ల రూపాయల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు పెద్ద కంజర్ల చౌరస్తాలో శంకుస్థాపన చేశారు. అనంతరం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నందిగామ పాశమైలారం, బచ్చుగూడెంలలో గ్రామాలలో ప్రారంభించి చీరలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గ్రామ పంచాయితీలకు శాశ్వత ప్రాతిపాదికన పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు.

బతుకమ్మ చీరల పంపిణీ..

బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి మహిళ ఆనందంగా పండుగ నిర్వహించుకోవాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. కాగా ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు భారీ గజమాలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మ శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఎంపీడీవో బన్సీలాల్, సీఐ లాలునాయక్, ఆయా గ్రామాల సర్పంచులు ఉమావతి గోపాల్,కృష్ణ, సుమతి రామచందర్, నరసింహ,రాజ్‌కుమార్, నారాయణరెడ్డి, ఎంపీటీసీలు నాగజ్యోతి లక్ష్మణ్, మమత బిక్షపతి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, దశరథ్‌రెడ్డి, బిక్షపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కనువిందు.. నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ మేళాకు మంచి స్పందన లభిస్తోంది. గృహాలంకరణ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బుధవారం మయూరి డ్యాన్స్ అకాడమి గురువు యుక్తారెడ్డి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో మూషిక వాహన, పుష్పాంజలి, గోవిందా,గోవిందా, భామాకలాపం, లింగాష్టకం, శ్రీలలిత హారతి, కృష్ణాష్టకం, బృందావన తిల్లాన, తారంగం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు యామిని, మౌక్తిక, శాన్వి, భవిష్య, నేహ, కృతిక, గుణశ్రీక్షిత, నమ్రత, ధనస్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లు కబ్జా చేశారు.. గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు



గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న వట్టినాగులపల్లి ప్లాట్ల కొనుగోదారులు

రాయదుర్గం: వట్టినాగులపల్లి సర్వేనంబర్ 111 నుంచి 190 వరకున్న 460.6 ఎకరాల భూమిలో 1998లో లేఅవుట్ చేసి 3,330 ప్లాట్లు చేసి విక్రయించారని, కానీ వాటిని కొందరు కబ్జా చేశారని కొనుగోలుదారులు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. శంకర్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో ఏర్పాటు చేసిన లేఔట్‌లో ప్లాట్లు ధరలు పెరగడంతో కబ్జాదారులు రెవెన్యూ రికార్డులు తారుమారు చేయడమే కాకుండా ధరణిలోనూ పేర్లు వచ్చేలా చేసుకున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ప్లాట్లు కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 3వేల మంది కుటుంబాలు భవిష్యత్తు అవసరాల కోసం ప్లాట్లు కొనుగోలు చేశారని వారందరికీ న్యాయం చేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్ల కొనుగోలుదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఏవీ కృష్ణారెడ్డి, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి

- సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు
- నేడు టెక్ మహీంద్రాలో ఎన్నికల సంఘం సమావేశం

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని టెక్ మహీంద్రాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్యూరోక్రాట్లతో ఎన్నికల కమిషన్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సజావుగా సాగేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం ఈ కింది మార్గాల్లో భారీ ట్రాఫిక్ ఉంటుందని వాహనదారులు గమనించాలని అధికారులు సూచించారు.

- లెమన్‌ట్రీ జంక్షన్ -ఫీనిక్స్ ఎరేనా రోడ్-టెక్ మహీంద్రా రోడ్-సీఐఐ జంక్షన్
- ఐకియా రోటరీ, లెమన్‌ట్రీ జంక్షన్- సైబర్ టవర్ జంక్షన్
- కేబుల్ బ్రిడ్జి, సీ గేట్ జంక్షన్, ఐకియా రోటరీ
- కొత్తగూడ జంక్షన్ నుంచి సైబర్ టవర్ జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని అధికారులు సూచించారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు



శ్రామిక భవన్ నుండి ర్యాలీగా వెళ్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు విమర్శించారు. ఆశా వర్కర్ల సమ్మె 10వ రోజు బుధవారం పట్టణంలోని శ్రామికభవన్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ..5 న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం వచ్చే రూ. 9,500 వేతనం ఏ మాత్రం సరిపోవడం లేదని, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు గీత, హైమావతి, వీరమణి, సరిత, రాణి, గంగ ఇతరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రాప్లింగ్(రెజ్లింగ్) చాంపియన్‌షిప్‌లో రాణించిన నానక్‌రాంగూడవాసి

92 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన ధన్‌రాజ్‌సింగ్



రాయదుర్గం: నానక్‌రాంగూడవాసి, గచ్చిబౌలి డివిజన్ మాజీ ఏరియా కమిటీ సభ్యుడు నింబ ధన్‌రాజ్‌సింగ్ జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) చాంపియన్‌షిప్-2023లో రాణించారు. హర్యానా రాష్ట్రం రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీలో జాతీయస్థాయి గ్రాప్లింగ్(రెజ్లింగ్) చాంపియన్‌షిప్-2023 పోటీలలో వెటరన్ కేటగిరి, 92 కేజీల విభాగంలో పాల్గొన్న ధన్‌రాజ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. కాగా గత ఏడాది కూడా 84 కేజీల విభాగంలో ఆయన బంగారు పతకాన్ని సాధించారని స్థానికులు తెలిపారు.

ప్రతి ఇంటికీ మంచి నీరు అందిస్తున్నాం

- అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీటిని అందిస్తుందని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డ్ రూప శ్రీ కౌంటీ, నందన్ మెడోస్, శంకర్ గ్రీన్ హోమ్స్, దుర్గ ప్రావిన్స్‌లలో బుధవారం మిషన్ భగీరథ మంచినీటి పైప్‌లైన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమీన్‌పూర్ మున్సిపాలిటీ రోజురోజుకీ అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొల్లూరి చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు, బిజిలి రాజు, నవనీత జగదీష్, కవితా శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, ఆంజనేయులు, చౌటకూరి మైపాల్ రెడ్డి, కొల్లూరి యాదగిరి ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ వర్క్‌ప్లేస్‌గా సింక్రోనీ

సాక్షి, సిటీబ్యూరో: మహిళా ఉద్యోగినుల విధి నిర్వహణకు సంబంధించి ఈ ఏడాదికి గాను ఉత్తమ సంస్థల్లో ఒకటిగా మాదాపూర్‌లో ఉన్న ఆర్థిక సేవల కంపెనీ సింక్రోనీ...ఎంపికైందని నగరానికి చెందిన సంస్థ ప్రతినిధులు తెలిపారు. గ్రేట్ ప్లేస్ టూ వర్క్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన టాప్ 10 ఇండియాస్ బెస్ట్ వర్క్ ప్లేసెస్‌లో తమ కంపెనీ నిలవడం పట్ల సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ సెహగల్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో రూ.2.98 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొంటారని పేర్కొన్నారు. రూ.30 లక్షలతో గుల్‌మొహర్‌పార్కులో సీసీరోడ్డు, నేతాజీనగర్‌లో రూ.30లక్షలతో సీసీరోడ్డు, రూ.30 లక్షలతో గోపన్‌పల్లిలో సీసీరోడ్డు, కోటి రూపాయలతో టీఎన్‌జీఓ కాలనీలో సీసీరోడ్డు, రూ.68 లక్షలతో నానక్‌రాంగూడలో సీసీరోడ్డు, రాయదుర్గంలో రూ.40 లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని శివానగర్ గ్రామంలో రూ. 25లక్షల నిధులతో నిర్మించిన యువజన సంఘం, రజక సంఘం భవనాలను బుధవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వలక్ష్యమన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ రేఖ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది



గోకుల్‌ప్లాట్స్‌లో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

హఫీజ్‌పేట్ : సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ డివిజన్లలో సుమారు రూ.13 కోట్ల 74 లక్షల 50వేల నిధులతో సీసీ రోడ్ల పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. మాదాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, మియాపూర్ డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో రూ.176 లక్షలు, అయ్యప్పసొసైటీ కాలనీలో రూ.73 లక్షలు, సిద్ధివినాయకనగర్‌లో రూ.32 లక్షలు, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, రామకృష్ణనగర్, మదీనాగూడ, మైత్రినగర్ ఫేజ్ 3లో రూ.180 లక్షలు, సాయినగర్, యూత్ కాలనీ, భాను టౌన్‌షిప్‌లో రూ.60 లక్షలు, హుడా కాలనీ, శాంతినగర్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.